# 'ప్రార్థన'

టి.శ్రీనివాసశ్రీ

**"ఒసేవ్, స్పందనా...! ఒక్కసారి ఇలా రావే..."**

**అంటూ బిగ్గరగా మా బామ్మ పెట్టిన గావుకేకకు ఉలిక్కిపడ్డాను.**

**ఆ కంగారులో క్యారెట్ తరుగుతున్న చేతివ్రేలికి చాకు కొన తగిలి ఎర్రని రక్తం జలజలా కారిపోసాగింది.**

"బామ్మా...! రక్తం..." అని భయంతో పొలికేక పెట్టాను.

నా అరుపుకి మా బామ్మ అదిరిపడేట్టుగా పరుగున వచ్చి "ఏమయ్యిందే, నా చిట్టితల్లీ!" అంటూ నా చేతివేలి నుండి ధారకడుతున్న రక్తాన్ని చూసి మా బామ్మ తనను తాను నిభాళించుకోలేకపోయింది.

"అయ్యయ్యో...! నా చిట్టి తల్లికి ఎంత నెత్తురు పోతుందో... ఈశ్వరా! నువ్వే కాపాడు. ముదనష్టపు దాన్ని అనవసరంగా ఈ పని దీనికి అప్పగించాను" ఎంతగానో విలవిల్లాడిపోయింది మా బామ్మ.

గబగబా అయోడిన్, కాటన్ తెచ్చి తెగిన గాయానికి చిన్న కట్టుకట్టింది. "పాపిష్టిదాన్ని అస్సలు తప్పంతా నాది" అంటుండగా ఉబికి వస్తోన్న కన్నీళ్లు జలజలామంటూ చిన్నగా అదురుతున్న మా బామ్మ చెంపలను తాకి, సన్నని ధారగా జారిపోతున్నాయి.

అప్పుడు నాకు దెబ్బతగిలిన బాధకంటే మా బామ్మ స్థితికి నా కళ్లల్లో ఆర్ద్రతతో కూడిన తడి కదలాడింది.

'మా బామ్మకి నేనంటే ఎంత ప్రేమ... వాత్సల్యము!! పదహారేళ్ళ వయసు మీదపడినా నన్నింకా పసిపాపగానే చూసుకుంటోంది'. అనుకుంటూ మా బామ్మవేపు చూశాను అపురూపంగా.

చిన్న పమిల్లలా తన్నుకు వస్తోన్న కన్నీళ్లను చీరకొంగుతో ఒత్తుకొంటోంది.

అదేంటో, మా బామ్మంటే మా ఇంట్లో అందరికీ చచ్చేంత హడల్. అమ్మ, నాన్నలకే కాక చిన్నాన్నలకు, అత్తయ్యలకు చివరకు చనిపోయిన తాతయ్యకు కూడా! దీనిని భయం అనేకంటే భయంతో కూడిన గౌరవం అంటేనే సబబుగా ఉంటుంది. ఎవరు తప్పుచేసినా నిలదీసే మనస్తత్వంగల మా బామ్మకి నేనంటే పంచప్రాణాలు మరి!

"బామ్మా...! ఇప్పుడు నాకేమయ్యిందని! చిన్నగాయమే కదా! రెండ్రోజులలో అదే తగ్గిపోతుందిలే. నువ్విక్కడ బాధపడుతూ కూర్చుంటే అక్కడ మమ్మీ, డాడీ వచ్చే ట్రైన్ వచ్చేస్తుంది. తర్వాతొచ్చి ఈ వంట భరతం పడదాం ఏమంటావు?" అంటూ మా బామ్మ మెడచుట్టూ చేతులు వేస్తూ అల్లుకుపోయాను ప్రేమగా.

"ఏంటే, ఇది చిన్నగాయమా?! తగ్గటానికి ఎన్నిరోజులు పడుతుందో, ఏమో...?! నేనెంత అరచి గీపెట్టుకున్నా..." ప్రేమ, ఆప్యాయత కలబోసిన చిరుకోపంతో తన మెడమీంచి నా రెండుచేతుల్ని విసురుగా తీసివేసింది.

"సరేలే! ఈ విషయం ఎప్పుడూ ఉన్నదేగా...! నేను చిటికెలో డ్రెస్ ఛేంజ్ చేసుకుని వచ్చేస్తాను. నీవు కూడా బిరడీ అండ్ బీ హ్యాపీ" అంటూ నా గది వేపు పరుగు తీశాను.

★ ★ ★

మా గ్రామానికి ఓ అర కిలోమీటరు దూరంలోనున్న రైల్వేస్టేషన్ వేపు కాలినడకన బయలుదేరాం నేనూ, మా బామ్మ.

మాకన్నా ముందే ట్రైన్ వచ్చేస్తుందేమోనన్న భయంతో గబగబా నడుస్తుండగా... మేం నడుస్తోన్న రోడ్డుకు కుడివేపుగా ఏదో తదేకంగా చూస్తూ ఆగిపోయింది మా బామ్మ.

అప్రయత్నంగా నేనూ అటువేపుగా చూపు మరల్చాను.

అంతే-

నిర్లిప్తత, నిశ్శబ్దం... ఒక్కసారిగా నాలో చోటుచేసుకుని, అసహ్యంతో నా మొహం ముడుచుకుపోయింది.

నలుగురు వ్యక్తులు ఓ చనిపోయిన పశువును తలక్రిందులుగా ఓ లావుపాటి కర్రకు వేలాడదీసికొని, ఆ కర్రను వెనుకవైపున ఇద్దరూ... ముందువైపున ఇద్దరు తమ భుజాలపై మోసుకుంటూ వెళ్ళిపోతున్నారు.

"ఒసేవ్, స్పందనా! ఆ చనిపోయిన గేదెను వాళ్ళు కొంపలవేపు తీసుకెళ్తున్నారేంటీ...?!" అన్యమనస్కంగా ప్రశ్నించింది మా బామ్మ.

"వాళ్ళు ఆ చనిపోయిన గేదెని పూడ్చరే, దాని శరీరాన్ని భాగాలుగా చేసి, వాటాలుగా పంచుకుతింటారు" అన్నాను మాంసాహారులపై ఉన్న ఏహ్యభావంతో.

నేను చెప్పిన దానికి మా బామ్మ "ఈ విషయం నేనూ విన్నాను. కానీ... ఈ దురాచారం ఇంకా పోలేదా?! అయినా చనిపోయిన జీవిని ఖనన పర్చడమో... పూడ్చిపెట్టడమో చేయాలి గానీ, ఇదేంటీ శవాన్ని నంజుకు తినడం చాలా ఘోరంగానూ, అసహ్యంగానూ లేదూ...?!!" అంటూ ఆశ్చర్యంగా అడిగింది.

నేను చిన్నగా నిట్టూర్పు వదుల్తూ-

"ఉందే, నాకు నీకన్నా ఎక్కువ మోతాదులోనే వుంది. అయితే మనమేమి చేయగలం? ఎవరి ఇష్టాలు వారివి" అన్నాను రుద్ధమైన కంఠముతో.

ఇంతలో కనుచూపుమేరలో రైల్వేస్టేషన్ కనిపించగానే, మా బామ్మని తొందరపెట్టేసి, గబగబా రైల్వేస్టేషన్ చేరుకున్నాం.

'మా మీద, మా డిపార్ట్‌మెంట్ మీద ప్రజలకున్న నమ్మకాన్ని మేమెన్నడూ వమ్ముచేయమన్నట్టుగా ట్రైన్ రైట్‌టైమ్‌కి అరగంట ఆలశ్యంగా వచ్చింది. ఆ ప్రదేశమంతా సన్నని భూకంపం వచ్చి కంపించినట్టుగా... గంభీరంగా మాకు కొద్దిదూరంలో ఆగింది.

నా కళ్ళు చకచకా బోగీలను జెట్‌వేగంతో పరిశీలించాయి.

ఓ బోగీలోంచి మా అమ్మ, నాన్నలే కాక, మా అత్తయ్య, మావయ్య, అతని చెల్లెలు, ఇంకా చిన్నపిల్లలు దిగుతున్నారు. ప్రయాణ బడలికతో వాడిపోయిన మొహాలకు నవ్వులను పులుముకుంటూ.

నేనూ, మా బామ్మ ఆనందంతో గబగబా ఎదురెళ్లాం. వారికి ఆహ్వానం పలకటానికి.

★ ★ ★

రెండ్రోజులనుండి మా ఇల్లంతా మహా సందడిగా వుంది మా బంధువుల రాకతో

ఉదయం పదిగంటలవేళ.

"ఒరే, రాముడూ..." అంటూ కేకేసింది మా బామ్మ మొక్కలకు అంటుకడుతున్న రాముడ్ని.

రాముడికి సూచనలిస్తూ, సాయంచేస్తున్న నేను 'ఎందుకే'- అని అడుగుదామనుకున్నంతలో "ఇదిగో, వత్తున్నానమ్మగోరు..." అంటూ మా బామ్మ దగ్గరకి వెళ్ళి చేతులు కట్టుకుని, ఏదో చెప్తుంటే తలూపుతూ మా బామ్మ ఇచ్చిన డబ్బుతీసుకొని వెళ్లిపోయాడు.

ఇంతలో మా మావయ్య చెల్లెలు సుధ వచ్చి నాకు తోటపనిలో సాయం చేస్తుండగా-

వెళ్ళిన పది నిమిషాల అనంతరం ఓ చేత్తో గేటు తీసుకుని, మరొకచేత్తో ఓ బ్రాయిలర్ కోడిని తలక్రిందులుగా పట్టుకుని వస్తున్నాడు రాముడు.

అప్పుడే నాకు అర్థమయ్యింది.

ఇందాక పది నిమిషాల ముందు రాముడితో మా బామ్మ ఏమి చెప్పిందో. ఆ కోడిని చూస్తూ నాలో నేను నిర్లిప్తత నిండిన జాలితో ఇలా అనుకున్నాను.

'రేపు ఒక్కరోజే నీ జీవితం.

మాపటిరోజు మా మనుష్యుల శరీరాల్లో ఓ మాంసపు ముద్దగా, రక్తంలో రక్తంగా కలిసిపోతావు, కరిగిపోతావు...!!!'

★ ★ ★

ఆరోజు రానే వచ్చింది.

మంచి, మానవత్వానికి రక్షణగా...

చెడు అన్యాయాల నాశనానికి ప్రతీక-

అయినటువంటి 'దసరా పండగ' రానే వచ్చింది.

ఆరోజు ఉదయాన్నే నిద్రలేస్తూ, బైటికి వచ్చాను వస్తున్న ఆవులింతలను ఆపుకుంటూ.

అప్పుడే ఉదయభానుడు తూర్పుకొండల నడుమ తొంగి చూస్తున్నాడు భయంగా... భీతిగా! వద్దామా లేక ఈరోజుకి మానేద్దామన్నట్టుగా.

ఏవో మాటలు విన్పించగా అటువేపు చూశాను.

మా బామ్మ రాముడ్ని ఎందుకనో మందలిస్తుంది. ఆసక్తితో చెవులు రిక్కించాను.

"ఏరా, కొనేటప్పుడు జాగ్రత్తగా చూసి కొనక్కర్లా?! కునుకుపట్టిన కోడికి, మంచి కోడికి తేడా తెలియకపోతే? ఎట్లారా?" అని విసుక్కుంటూ, మా బామ్మ తన కుడిచేతిలో వున్న ఆ కోడిని నేలపై పడేసింది.

ఆ శరీరంలో చలనం కనిపించలేదు.

చనిపోయినట్లుంది.

"ఒరే, దీన్ని ఎక్కడైనా పాతేసి, ఈ సారయినా జాగ్రత్తగా చూసి మంచిది పట్రా" అంటూ మా బామ్మ డబ్బుకోసం కాబోలు నా ప్రక్కగా ఇంట్లోకి వెళ్లింది.

-నేను కాసేపు అలా స్తబ్దుగా ఉండిపోయాను.

మా బామ్మ మాటలు నా మదిలో పదేపదే ధ్వనిస్తున్నాయి.

మూడ్రోజుల క్రితం చూసిన దృశ్యం నా కళ్ళముందు సినిమా రీలులా కదలాడింది.

నాకు తెలియకుండానే ఆలోచనలు రకరకాలుగా నా మెదడిని చుట్టిముట్టి, నరాల మీద యుద్ధభేరీలు మ్రోగించినట్టుగా తలంతా వేడెక్కిపోసాగింది.

ఇంతలో ఇంట్లోంచి నా ప్రక్కగా వెళ్తోన్న మా బామ్మని అన్యమనస్కంగా చూశాను. వెంటనే క్షణకాలం ఆలస్యం భరించలేనట్టుగా

నా స్వరపేటిక తెరుస్తూ-

"బామ్మా, ఎక్కడకే?" అంటూ ప్రశ్నించాను.

"ఏమే, ఇక్కడేమి చేస్తున్నావే! అవతల బోలెడు పనులున్నాయి. ముందు మీ నాన్న స్కూటర్‌కి పూజ చేయాలి. ఇంకా..." అంటూ ఏదో చెప్పబోతుండగా నేను మధ్యలోనే కలగజేసుకుని-

"అది కాదు. ఆ డబ్బు దేనికి తీసుకెళ్తున్నావు?" అని సూటిగా ప్రశ్నించాను.

మా బామ్మ నా గొంతులోని తీవ్రతకి ఆశ్చర్యపడినట్టుంది.

"ఏంటే, అంత శ్రద్ధగా అడుగుతున్నావు. మొన్న కొన్న కోడి కునుకుపట్టి చచ్చిపోయింది. అందుకని మరొకటి తెప్పిద్దామని" అంది కొంచెం విసుగుపుట్టిన స్వరంతో.

మా బామ్మ మాటలు నన్ను తీవ్ర కలవరానికి గురిచేశాయి.

అంతలోనే తెప్పరిల్లి-

"బామ్మా! గుర్తున్నాయా?! మూడ్రోజుల క్రితం నీవు త్రోవలో అన్నమాటలు... గేదె శవాన్ని వాళ్లు నంజుకుతినడం అన్యాయం, హేయం అన్నావు, అవునా?! కానీ బామ్మా...! ఓ విధంగా చెప్పాలంటే మనకంటే వారే ఉన్నతులు, గొప్పవారు. వాళ్ళు ప్రాణంపోయిన ప్రాణుల శరీరాలను మాత్రమే పంచుకుతింటున్నారు. మరి మనమో ప్రాణంలేని శరీరాన్ని ఆహారంగా అంగీకరించం. కేవలం బ్రతికున్న ప్రాణుల ప్రాణం తీసిమరీ పంచుకు తింటున్నాం. మనమీద వాళ్లే నూటికి నూరుపాళ్ళు నయం కదా?!" అంటూ ఓ క్షణమాగి మా బామ్మ మొహంలో చోటుచేసుకున్న మార్పుని గమనించి-

"మనకు ఏ కోశానా లేని 'జీవకారుణ్యం' వాళ్లకి కొంచమైనా ఉందనే చెప్పాలి. నా వ్రేలికి చిన్న గాయమైతే ఎంతో వేదనకి గురై నీ చేతులతో కట్టుకట్టావే. అదే చేతులతో మన స్వార్థంకోసం మరో ప్రాణాన్ని బలి తీసుకోవటం అన్యాయం కాదా?!

ఒక జీవిని బ్రతికించే ప్రక్రియ మన చేతుల్లో లేనట్టే, ప్రాణం తీసే క్రియకు మనకుగల అర్హత ఏమిటి??" అంటూ మా బామ్మ మొహంలోకి సూటిగా చూశాను.

మా బామ్మ మొహంలో రంగులు మారిపోతున్నాయి.

కొన్ని క్షణాలు భారంగా... నిర్వేదంగా దొర్లిపోతున్నాయి.

నిశీథి నిశ్శబ్దం మా ఇద్దరి మధ్య నృత్యం చేస్తుండగా, నేనా నిశ్శబ్దాన్ని చీలుస్తూ "బామ్మా...! నోరులేని జీవాలను మన నోటి రుచికై భక్షించటం భావ్యమా? శాసనాలు, చట్టాల పరిధిలో ఏ కోర్టులూ శిక్షించలేని ఈ మూగజీవుల హత్యల పరంపరకి అంతం లేదా?! మనం హంతకులము కాదా?? బామ్మా...!!! ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించు" అన్నాను ఉద్వేగంగా ఊగిపోతూ.

నే చెప్పిందంతా ఓపిగ్గా విన్న మా బామ్మ-

"అయ్యిందా? నీ సూక్తిముక్తావళి" అంటూ నా మాటలను తృణప్రాయంగా కొట్టేసింది. అందుకు నేనెంతగానో బాధపడ్డాను.

రాముడు మా బామ్మ చెప్పినట్టుగానే మరో కోడిని తీసుకువచ్చాడు.

నేను స్తబ్దుగా నా రూమ్‌లోనే వుండిపోయాను.

మధ్యాహ్నం ఒంటిగంట కావస్తోండగా "స్పందనా... భోజనానికి రావే" మా బామ్మ కేకేసింది.

"నాకు ఆకలిగా లేదు. భోంచెయ్యనూ..." రూమ్‌లోంచే బిగ్గరగా చెప్పాను.

అంతే- మా బామ్మ గబగబా వచ్చి 'తింటే అదే ఆకలవుతుంది" అంటూ రెక్కపుచ్చుకు లాక్కెళ్ళి పంక్తిలో కూర్చుండబెట్టింది.

మా బామ్మ వడ్డన చేస్తుండగా, మా అమ్మ వచ్చి "అత్తయ్యగారూ! వడ్డన విషయం నేను చూసుకుంటాను. మీరు భోంచెయ్యండి" అంటూ బలవంతంగా నా ప్రక్కన కూర్చుండబెట్టింది.

మా బామ్మ మీద కోపంగా వుండటంతో, మా బామ్మ నాప్రక్కన కూర్చున్నా గుర్తించనట్టు నటించాను.

మా అమ్మ వరుసగా కోడికూర వడ్డిస్తూ నా దగ్గరగా వచ్చి చిన్నగా నిట్టూర్పు విడచి, నన్ను తప్పించి మా బామ్మకు వడ్డించబోతుండగా-

"అమ్మా... అనురాధా! ఇక ముందు ఈ కూర వద్దమ్మా. నా మనవరాలికోసం తయారుచేసిన ఆ క్యాబేజీ కూర చాలమ్మ!" అంటూ మా బామ్మ హుందాగా ఫోజిస్తూ పైన తిరుగుతోన్న ఫ్యాన్‌కేసి చూస్తోంది.

అంతే- ఒక్కసారిగా నన్ను నేను నమ్మలేకపోయాను.

ఆనందంలో ఉన్నపళంగా ఎగిరి గంతెయ్యాలన్పించింది.

'నా హృదయ స్పందన వ్యర్థమైపోకుండా, జీవకారుణ్యానికి జీవంపోసి, నా ప్రార్థనకి ప్రతీకగా నిలిచిన మా బామ్మలాంటి దయామయుల నిలయం కావాలి ఈ నా ప్రపంచం' కళ్ళు మూసుకుని ప్రపంచం మరచిన గాఢ ప్రార్థనలో మునిగిపోయాను.

